సాక్షి
పల్నాడు
బుధవారం | 7 | జూన్ | 2023



సుబ్బారాయుడి సన్నిధిలో..

శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆయనకు స్వాగతం పలికారు.



దుర్గమ్మ సేవలో..

విజయవాడ: దుర్గమ్మను కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి విని మహాజన్ మంగళవారం దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.



భక్తిశ్రద్ధలతో యాగ పూర్ణాహుతి


పాత గుంటూరు: ఎస్వీఎన్ కాలనీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి గుడిలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం యాగపూర్ణాహుతి, ప్రత్యేక పూజలు జరిగాయి.

న్యూస్‌రీల్

వైద్య సిబ్బంది బదిలీల కోసం 10లోపు దరఖాస్తు చేయాలి

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న జిల్లా క్యాడర్ వైద్య సిబ్బంది సాధారణ బదిలీల కోసం ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లు ఒకే స్థానంలో పనిచేస్తున్న వారి జాబితా, ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్రదేశాల వివరాలు, దరఖాస్తు ఫారాలను గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫాం డౌన్‌లోడు చేసుకుని తాము బదిలీ కోరుకుంటున్న ప్రాంతాలను పూరించి డీడీవో ద్వారా 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు స్వయంగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలని వివరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న స్థానంలో ఏప్రిల్ 30 నాటికి రెండేళ్లు నిండిన ప్రతి ఉద్యోగి రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. 6 నుంచి 11 వరకు రిక్వెస్ట్ దరఖాస్తులను పరిశీలిస్తామని వివరించారు. బదిలీల గ్రీవెన్స్‌లను 14వ తేదీ పరిశీలిస్తామని, 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సాధారణ బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డాక్టర్ శ్రావణ్‌బాబు వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు వచ్చే నీటిచేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.60 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1,800, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,300 వరకు పలికింది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే.. చట్ట ప్రకారం చర్యలు తప్పవని రీజినల్ జాయింట్ రవాణాశాఖ కమిషనర్(ఆర్జేసీ) డాక్టర్ బి.కృష్ణవేణి స్పష్టం చేశారు. స్వర్ణభారతినగర్‌లోని ఆర్టీఓ కార్యాలయంలో మంగళవారం ఆటో, ట్రాక్టర్ యూనియన్ నేతలు, డ్రైవర్లతో సమావేశం జరిగింది. ఆర్జేసీ కృష్ణవేణి మాట్లాడుతూ ట్రాక్టర్లలో ప్రయాణికులను ఎక్కించకూడదని, ఆటోల్లోనూ పరిమితికి మించి ప్రయాణం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకుని తిరిగితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

384 మంది ఉపాధ్యాయులకు అలవెన్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు సీనియర్ ఎస్జీటీలకు నెలకు రూ.2,500 అలవెన్సుతో తాత్కాలిక ఉద్యోగోన్నతులు కల్పించిన ప్రభుత్వం ఇచ్చిన మాటకు అనుగుణంగా అలవెన్సు చెల్లింపులకు ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ విధంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న 384 మంది ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరనుంది.

మహా మండపం దిగువన ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆది దంపతులకు నిర్వహించే ఆర్జిత సేవల టికెట్ల విక్రయించేందుకు మహా మండపం దిగువన మరో కౌంటర్‌ను దేవస్థానం ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఆర్జిత సేవల టికెట్లు కావాల్సిన వారు కొండపైకి చేరుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణం వరకు వెళ్లాల్సి ఉండేది. దీంతో భక్తులు కొన్ని ఇబ్బందులను ఎదుర్కొనే వారు. నూతన పాలక మండలి వచ్చిన తర్వాత భక్తులు తమ ఇబ్బందులకు చైర్మన్ కర్నాటి రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మూడో పాలక మండలి సమావేశంలో ఈ అంశాన్ని పొందుపరిచి, కౌంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్ కోరారు. మహా మండపం దిగువన టోల్ ఫ్రీ నంబర్ కార్యాలయంలో అదనపు టికెట్ల కౌంటర్‌ను దేవస్థానం ఏర్పాటు చేసింది. ఈ కౌంటర్‌లో అన్ని ఆర్జిత సేవల టికెట్లతో పాటు అన్నదానానికి విరాళాలు అందజేయవచ్చు. అదనపు కౌంటర్ ఏర్పాటు చేయడంతో భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సంతోషం ఉరకాలనీ

సొంతింట్లో పది నెలల నుంచి హాయిగా..



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు కేతావత్ పార్వతి. ఈమెకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. నరసరావుపేటలోని తొమ్మిదో వార్డు శ్రీనివాస నగర్‌లో నెలకు రూ.3వేలు అద్దెకు రేకుల షెడ్డులో ఉండేవాళ్లు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వీరికి జగనన్న కాలనీలో సెంటు స్థలం మంజూరైంది. గృహనిర్మాణ సామగ్రి, నగదు సాయమూ అందడంతో ఇంటి నిర్మాణం పూర్తిచేసుకున్నారు. వసతులన్నీ ఉండడంతో ప్రస్తుతం పది నెలల నుంచి జగనన్న కాలనీలోనే నివాసం ఉంటున్నారు. అక్కడే చిన్న హోటల్ నడుపుతున్నారు. ముగ్గురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. హాయిగా కుటుంబం గడిచిపోతోంది. సొంతిల్లు నిర్మించుకుంటామని కలలో కూడా అనుకోలేదని, సీఎం జగన్ సార్ పుణ్యం వల్లే ఇది సాధ్యమైందని పార్వతి ఆనందం వ్యక్తం చేశారు.

ఇళ్లు.. పరవళ్లు

- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం
- గృహనిర్మాణ ప్రగతిలో 19వ స్థానానికి ఎగబాకిన పల్నాడు
- కొత్త జిల్లా ప్రకటన తర్వాత పెరిగిన ఇళ్ల నిర్మాణం
- ఇప్పటికే పూర్తయిన ఇళ్లలో లబ్ధిదారుల నివాసం
- వసతులపై హర్షం వ్యక్తం చేస్తున్న వైనం





నరసరావుపేట వినుకొండ రోడ్డులో జగనన్న కాలనీలో సెంటు స్థలంలో పూర్తయిన సుందర గృహాలు

నరసరావుపేట: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ఊపందుకుంటోంది. ఇచ్చిన సెంటు, సెంటున్నర స్థలాల్లో లబ్ధిదారులు అద్భుతమైన భవంతులు నిర్మిస్తున్నారు. కొందరు ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి గృహప్రవేశాలూ చేసేశారు. అక్కడే నివాసం ఉంటున్నారు. ఎన్నాళ్ల నుంచో అద్దె ఇళ్లల్లో మగ్గుతున్న తమకు ఇంటి స్థలం ఇచ్చి ఓ ఇల్లు సమకూర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలుకుతున్నారు.

42,012 మందికి స్థలాలు

నవరత్నాలు–అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 42,012 మందికి అధికారులు స్థలం కేటాయించారు. ప్రతి లబ్ధిదారునికీ ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు ఉచితంగా అందజేస్తున్నారు. ఇసుక ఉచితంగా ఇవ్వటంతో పాటు సిమెంటు, నిర్మాణ సామగ్రిని రాయితీపై అందజేస్తున్నారు. ఇప్పటివరకు 41,383 మంది శంకుస్థాపన చేయగా, 19,631 ఇళ్ల నిర్మాణం పునాది స్థాయి దాటింది. 6,338 గృహాలు పూర్తయ్యాయి. గృహప్రవేశాలూ జరిగాయి.

జిల్లా ఏర్పడిన తర్వాత వేగంగా...

పల్నాడు జిల్లా ఏర్పడక ముందు కేవలం 5,200 గృహాల నిర్మాణమే ప్రారంభమైంది. 2022 ఏప్రిల్ నాలుగో తేదీన పల్నాడు జిల్లా ఏర్పడిన తర్వాత కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యేల సహకారంతో ఇళ్ల నిర్మాణం వేగవంతమైంది. నరసరావుపేట వినుకొండరోడ్డులోని ఉప్పలపాడు–లింగంగుంట్ల మధ్యన గుంటూరు–కర్నూలు రహదారికి 200 మీటర్ల దూరంలో 100 ఎకరాలు సేకరించి పేదలకు స్థలాలు అందించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. చిలకలూరిపేట రోడ్డులోని టిడ్కో గృహాలకు ఎదురుగా 45 ఎకరాల్లో స్థలాలు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణమూ చేపట్టారు. పిడుగురాళ్ల ఆదర్శ నగర్‌లో 1,320 మందికి స్థలాలు ఇవ్వగా 1,120 గృహాల నిర్మాణం చేపట్టి వడివడిగా పనులు చేస్తున్నారు.

అత్యాధునిక గృహ సామగ్రి

లబ్ధిదారుల ఇంటికి కావాల్సిన సామగ్రిని ప్రభుత్వమే రాయితీపై అందజేస్తోంది. పౌండర్ కోటెడ్ గాల్వనైజ్డ్ డోర్ ఫ్రేమ్ రూ.2,982కు, విద్యుత్ విభాగానికి చెందిన 19 వస్తువులతో కూడిన కిట్ రూ.5730కు, నీటి సరఫరా, డ్రెయినేజీకు ఉపయోగించే 10 వస్తువులతో కూడిన సెట్‌ను రూ.4,410కి, రూ.975 విలువైన టాయిలెట్ సెట్‌ను అందజేస్తోంది.

నియోజకవర్గాల వారీగా జగనన్న ఇళ్ల నిర్మాణం ఇలా..

నియోజకవర్గం	లబ్ధిదారులు	శంకుస్థాపన చేసినవారు	గృహాలు పూర్తి
చిలకలూరిపేట	4,377	4,361	648
నరసరావుపేట	5,892	5,886	862
వినుకొండ	6,423	6,181	733
గురజాల	5,218	5,187	747
మాచర్ల	4,478	4,405	178
సత్తెనపల్లి	5,017	4,984	1,313
పెదకూరపాడు	10,607	10,379	1,857
మొత్తం	42,012	41,383	6,338

పది నెలల నుంచి ఉంటున్నాం



బీసీ కాలనీలో అద్దె ఇంటిలో ఉండేవాళ్లం. అద్దె రూ.2,500. అంతంతమాత్రం సంపాదన. సీఎం వైఎస్ జగన్ మాకు సెంటు స్థలం ఇచ్చారు. వెంటనే ఇల్లు నిర్మించుకున్నాం. పది నెలల నుంచి హాయిగా జగనన్న కాలనీలోనే ఉంటున్నాం. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– షేక్ కరీమూన్, జగనన్న కాలనీ, నరసరావుపేట

ఇల్లు నిర్మించుకున్నాం.. ఆనందంగా ఉంది



శాలివాహన నగర్‌లో అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. జగనన్న కాలనీలో ఇంటిస్థలం ఇచ్చారు. ప్రభుత్వ సాయంతో ఇల్లు నిర్మించుకున్నాం. అక్కడే నివాసం ఉంటున్నాం. మాతో పాటు ఇక్కడ ఐదువేల మందికి ఇళ్లనిర్మాణం జరుగుతోంది. ఒక ఊరిలా కనిపిస్తోంది. సంతోషంగా ఉంది.

– షేక్ నూర్జహాన్, వినుకొండ

ఇళ్ల నిర్మాణం ఇంకా వేగవంతం కావాలి



ప్రస్తుతం వేసవి కావడంతో ఇళ్ల నిర్మాణం ఇంకా వేగవంతం కావాలి. వర్షాలు వస్తే మళ్లీ ఆటంకాలు ఎదురవుతాయి. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత ఇళ్ల నిర్మాణంలో పురోగతి బాగా కనిపిస్తోంది. రాష్ట్రంలో చివరి స్థానం నుంచి 19వ స్థానానికి ఎగబాకాం. లబ్ధిదారులు జాతీయ బ్యాంకుల్లోనే అకౌంట్లు తెరవాలి. సమస్యలు ఏవైనా ఉంటే గృహనిర్మాణశాఖ ఉద్యోగులను నేరుగా సంప్రదించవచ్చు.

–ఎస్.వేణుగోపాలరావు, పీడీ, హౌసింగ్

రేపటితో ముగియనున్న వెబ్ ఆప్షన్లు

తుది దశకు ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. బదిలీలు, ఉద్యోగోన్నతుల ద్వారా లాంగ్ స్టాండింగ్ విభాగంలో వివిధ కేడర్ల వారీగా 3,350 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలుగనుంది. అదే విధంగా రిక్వెస్ట్ బదిలీ మరో 2,938 ఉపాధ్యాయులు వేచి చూస్తున్నారు. బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో కేటగిరీల వారీగా పాఠశాలలను ఎంపిక చేసుకునేందుకు ఉద్దేశించిన వెబ్ ఆప్షన్ల నమోదుకు షెడ్యూల్ ప్రకారం హెచ్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన తుది గడువు మంగళవారం ముగిసింది. అదే విధంగా స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజెస్‌లకు వెబ్ ఆప్షన్ల నమోదు గడువు బుధవారం అర్ధరాత్రి వరకు, ఎస్జీటీలకు ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి 12.00 గంటల వరకు గడువు ఇచ్చారు. బదిలీలతో పాటు సీనియార్టీ ప్రాతిపదికన 515 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు దక్కనున్నాయి. ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులు సైతం ఆయా కేడర్ల వారీగా ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. దీంతో మరో రెండు రోజుల్లో బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి కానుండగా, ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకున్న ఉపాధ్యాయులకు ట్రాన్స్‌ఫర్, ప్రమోషన్ ఆర్డర్లు జారీ కానున్నాయి. ప్రభుత్వం భారీ స్థాయిలో బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించడంతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



మోడల్ స్కూల్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్



మోడల్‌స్కూల్లో కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్‌తో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 12న పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో జరిగే విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమానికి హాజరవుతున్నందున పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఏపీ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ సూచించారు. మంగళవారం మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఆయన సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మేరీ సుసాన, ఉపాధ్యాయులు, ఇతర విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ పాఠశాలలన్నీ ఈనెల 12న ప్రారంభమవుతున్నందున విద్యార్థులకు జగనన్న చేస్తున్న మేలులను వివరించాలని సూచించారు. పాఠశాలల్లో బైజూస్ కంటెంట్, డిస్‌ప్లే , ఎగ్జిబిషన్ అన్నీ సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. జగనన్న విద్యాకానుక కిట్లన్నీ పాఠశాలలకు చేరేలా చూసుకోవాలని చెప్పారు. ప్రవీణ్ ప్రకాశ్ వెంట జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఏర్పాట్లు వేగవంతం

అనంతరం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, కలెక్టర్ లోతేటి శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్, ఆర్డీవో రాజకుమారి, వివిధ శాఖల అధికారులు క్రోసూరు మోడల్ స్కూల్ పరిసరాలు, పొలాలను పరిశీలించారు. హెలిప్యాడ్, సభాస్థలం, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ శివరామయ్య పాల్గొన్నారు.

పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలి

నేర సమీక్షలో ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఎస్పీ వకుల్ జిందాల్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నేర సమీక్ష నిర్వహించారు. తొలుత స్పందన అర్జీలు, వివిధ కేసులపై సర్కిళ్ల వారీగా సమీక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ దిశ, అత్యవసర టోల్‌ఫ్రీ నంబర్లకు వచ్చే ఫోన్‌కాల్స్, సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీసు సిబ్బంది ప్రజలతో మర్యాదగా మెలగాలని ఆదేశించారు. క్రమశిక్షణ మీరితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని చెప్పారు. పేకాట, కోడిపందేల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనుమతి లేని బాణసంచా, మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలపై పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిమితికి మించి ఎక్కువ మందితో వెళ్తున్న వాహనాల రాకపోకలపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రయవిక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు.



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్‌జిందాల్

19 నుంచి ఆషాఢ మాసోత్సవాలు

- నెల రోజులు దుర్గమ్మకు సారె పండుగ
- జూలై 1 నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు
- మూడు రోజులు అమ్మవారికి కాయగూరలు, ఆకుకూరలతో అలంకరణ



ఆషాఢ మాసోత్సవాలు(ఫైల్)

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల 19వ తేదీ నుంచి జూలై 17వ తేదీ వరకు నెల రోజుల పాటు ఆషాఢ మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మాసంలో భక్తులు అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఆషాఢ మాసం తొలి రోజైన 19వ తేదీన ఆలయ స్థానాచార్య, వైదిక కమిటీ సభ్యులు అమ్మవారికి తొలి సారె సమర్పిస్తారు. జూలై 17వ తేదీన దేవస్థానం తరఫున ఈఓ, ఆలయ అధికారులు, సిబ్బంది అమ్మవారికి సారె సమర్పిస్తారు. నెల రోజుల పాటు రాష్ట్రంలోని పలు ఆలయాలతో పాటు సేవా బృందాలు, భక్త బృందాలు అమ్మవారికి సారె సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి తరలి వస్తాయి. ఈ నేపథ్యంలో అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసేలా దేవస్థానం ఏర్పాట్లు చేయనుంది.

మూడు రోజులు శాకంబరీదేవి ఉత్సవాలు

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆషాఢ శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని జూలై ఒకటో తేదీ నుంచి ఆషాఢ పౌర్ణమి వరకు మూడు రోజుల పాటు శాకంబరీదేవి ఉత్సవాలు నిర్వహించనున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరిస్తారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలు, ఆకుకూరలు ఉపయోగించి తయారు చేసే కదంబ ప్రసాదం ఎంతో విశేషం. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ ఈ ప్రసాదం పంపిణీ చేస్తారు. జూలై మూడో తేదీ ఉదయం పది గంటలకు పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి.

'నీరు'పమాన కృషి

ముందస్తు.. శుభమస్తు

- నేడు ఖరీఫ్ సాగుకు నీటి విడుదల
- గత ఏడాది కంటే మూడు రోజుల ముందే
- జలవనరుల శాఖ మంత్రి చేతుల మీదుగా కార్యక్రమం
- ఉదయం ఎనిమిది గంటలకు సుముహూర్తం



2022 జూన్ 10న సాగునీటిని విడుదల చేస్తున్న జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పుడమితల్లిని ముద్దాడేందుకు బిరబిర కృష్ణమ్మ ఉరకలెత్తనుంది. ప్రకాశం బ్యారేజ్ నుంచి పొంగిపొర్లి డెల్టా ఆయకట్టులో పరవళ్లు తొక్కనుంది. తొలకరి కంటే ముందుగానే ముందస్తు.. శుభమస్తు.. అంటూ దీవించనుంది. ప్రభుత్వం కృష్ణాడెల్టాలో ఖరీఫ్ సాగుకు వరుసగా రెండో ఏడాదీ ముందుగానే సాగునీటిని విడుదల చేయనుంది. ముందస్తు సేద్యమే లక్ష్యంగా గత ఏడాది జూన్ పదినే ప్రకాశం బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ ఏడాది మరో మూడు రోజుల ముందుగానే బుధవారం ఉదయం శుభ ఘడియల్లో సుజల యజ్ఞానికి శ్రీకారం చుట్టనున్నారు.

పంటలు తుపాన్లు బారిన పడకుండా..

గతంలో ఏటా నవంబర్ మొదటి వారానికి పంట రావడం వల్ల ఆ నెలలో వచ్చే తుపాన్లు, అధిక వర్షాల బారిన పడి రైతులు నష్టపోయేవారు. దీనిని నివారించడమే లక్ష్యంగా గత ఏడాది నుంచి ప్రభుత్వం ముందస్తు సాగుకు రైతులను సన్నద్ధం చేస్తోంది. సాగునీరూ ముందుగానే విడుదల చేస్తోంది. దీనివల్ల మూడో పంటకూ అవకాశం కలుగుతోంది. కృష్ణా పశ్చిమ డెల్టాలో ప్రధానంగా సాగు చేసే వరి రకాలన్నీ 145 నుంచి 155 రోజుల్లో పంట చేతికి వచ్చేవే. వెదపద్ధతిలో సాగు చేస్తే పంట ఇంకా ముందు వస్తుంది. దీంతో నవంబర్ మొదటి వారానికి ఖరీఫ్ పూర్తి చేయవచ్చు. అందుకే సీఎం ఆదేశాల మేరకు నీటిపారుదల సలహామండలి సమావేశం తీర్మానాల ప్రకారం 2023 ఖరీఫ్ సాగు కోసం కృష్ణాడెల్టాలోని ఆయకట్టుకు బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకాశం బ్యారేజి నుంచి 500 క్యూసెక్కులు విడుదల చేయనున్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పాల్గొంటారు.

5.71 లక్షల ఎకరాలకు సాగునీరు

ప్రకాశం బ్యారేజి తూర్పు, పశ్చిమ కాల్వల ద్వారా మొత్తం 13.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా, ఇందులో 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉంది. ఇందులో గుంటూరు జిల్లాలో 1.84 లక్షల ఎకరాలు, బాపట్ల జిల్లాలో 3.80 లక్షల ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 0.07 లక్షల ఎకరాలు ఉన్నాయి. గుంటూరు చానల్ ద్వారా మరో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. సెంట్రల్ వాటర్ కమిషన్ కృష్ణాడెల్టా సాగు, తాగునీటి అవసరాల నిమిత్తం 1155.40 టీఎంసీల నీటిని కేటాయించింది. ఇందులో 67.94 టీఎంసీల నీటిని కృష్ణా పశ్చిమ డెల్టాకు, నాలుగు టీఎంసీలు గుంటూరు చానల్ పరిధిలోని సాగు, తా గు నీటి అవసరాలకు అధికారులు కేటాయించారు.

జలాశయాల్లో పుష్కలంగా నీరు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జలాశయాల్లో పుష్కలంగా నీరు ఉంది. నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.50 అడుగుల వద్ద ఉంది. ఇది 150.1900 టీఎంసీలకు సమానం. మరోవైపు పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ 34.588 టీఎంసీలు. ప్రస్తుతం పులిచింతల నీటినే కృష్ణాడెల్టాకు ఉపయోగిస్తారు.

గత ఆరేళ్లుగా ఖరీఫ్‌కు నీరు విడుదల చేసిన తేదీలు

సంవత్సరం	తేదీ
2016–17	18-07-2016
2017–18	28-06-2017
2018–19	21-06-2017
2019–20	12-07-2019
2020–21	01-07-2020
2021–22	06-07-2021
2022–23	10-06-2022

ముందుగానే నీరు

గతంతో పోలిస్తే రెండేళ్లుగా జూన్ పదిలోగా నీటిని విడుదల చేస్తున్నాం. దీని ద్వారా నవంబర్‌లో తుపాన్లు, అధిక వర్షాల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. మూడో పంటను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈ సంవత్సరం కృష్ణా పశ్చిమ డెల్టాలోని మొత్తం ఆయకట్టుకు నీటిని అందించేలా ప్రణాళిక సిద్ధం చేశాం.

– ఉమామహేశ్వరరావు, ఎస్ఈ, జలవనరుల శాఖ

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



ద్విచక్రవాహనాలు అందిస్తున్న ఎమ్మెల్యేలు కోన రఘుపతి, కరణం బలరామకృష్ణమూర్తి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. బాపట్ల జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో మూడు చక్రాల మోటారు వాహనాల పంపిణీ కార్యక్రమం కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం జరిగింది. జిల్లాలోని 47 మంది దివ్యాంగులకు రూ.56.64లక్షలు విలువైన మూడు చక్రాల మోటారు వాహనాలను జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు కోన రఘుపతి, కరణం బలరాం కృష్ణమూర్తి, ఏపీ డీఏఎస్‌సీఏసీ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, జిల్లా మేనేజర్ జి.అర్చన చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సమాన హక్కులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగుతుందన్నారు. అందరికీ సమాంతరంగా ప్రభుత్వ ఫలాలను అందిస్తుందని వివరించారు. జగనన్న పాలనలో ప్రభుత్వ సేవలు అందరికీ అందుతున్నాయన్నారు. ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తుందని వివరించారు. దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. అర్హులైన దివ్యాంగులందరికి మూడు చక్రాల మోటారు వాహనాలను అందజేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న దివ్యాంగులు కలలు నెరవేరుతున్నాయన్నారు. అవసరమైన లబ్ధిదారులందరికీ వాహనాలు అందజేస్తున్నామన్నారు. అర్హులైన దివ్యాంగులకు మంచి ఫలాలు అందుతాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప మేలు చేశారని ఏపీ డీఏఎస్‌సీఏసీ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. నామినేట్ పదవులలోనూ అందరికీ సమానత్వం కల్పించారన్నారు. దివ్యాంగులకు ఉచితంగా మోటర్ వాహనాలను పంపిణీ చేయడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1550 మోటార్ వాహనాలను పంపిణీ చేస్తుండగా ప్రతి నియోజకవర్గానికి 10 వాహనాలు కేటాయించిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. దివ్యాంగులకు విలువైన వాహనాలను ప్రభుత్వం వీరికి పూర్తిగా ఉచితంగా అందజేసినట్లు జిల్లా మేనేజర్ జి.అర్చన తెలిపారు. ఒక్కొక్క వాహనం విలువ రూ.1.20 లక్ష చొప్పున మొత్తం రూ.56,64,000 విలువైన వాహనాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, వివిధ శాఖల అధికారులు దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

సొంతిల్లుంటే ఎంతో గౌరవం

- లబ్ధిదారుల మోముల్లో ఆనందం
- 953 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే ఆర్కే



లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: అద్దెలు కట్టడం అవమానాలు భరించడం కంటే సెంటు స్థలం అయినా సొంతిల్లు ఉంటే సమాజంలో సముచిత గౌరవం ఉంటుందని పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. నగర పరిధిలోని నిడమర్రులో మంగళగిరి పట్టణానికి చెందిన బాప్టిస్టుపేట, కూరగాయల మార్కెట్, కొప్పురావు కాలనీ, సూర్యనారాయణ నగర్‌లకు చెందిన 953 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాను అందజేస్తామన్నారు.

సముచిత గౌరవం వస్తుంది



అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబసభ్యులు చనిపోతే ఇప్పుడు కొందరు యజమానులు ఆ ఇంటిలో మృతదేహాన్ని ఉండనివ్వడం లేదు. అంతేకాక కర్మకాండలు అయిన వరకు మాఇంటికి వద్దని చెబుతున్నారు. పేదలు ఎక్కడ ఉండాలి. శ్మశానంలో కర్మల భవనంలో 15 రోజులు నివాసం ఉండటం అంటే ఎంత నరకమో అనుభవించిన వారికే తెలుస్తుంది. సెంటు అయినా అరసెంటు అయినా సొంతిల్లు మాత్రమే సమాజంలో సముచిత గౌరవాన్ని ఇస్తుంది. ప్రతి పేద కుటుంబం సొంతింటి కలను నిజం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా ఉంటారు.

– కుక్కల రాజేశ్వరి, మంగళగిరి

జగనన్న పెద్దకొడుకు అయ్యారు



అద్దె ఇళ్లల్లో ఉండి అనుభవిస్తున్న వారికి అక్కడ కష్టాలు తెలుస్తాయి. మాలాంటి పేదలకు సొంతింటి కలను నిజం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా నిలవడం అభినందనీయం. అద్దె ఇంట్లో ఉంటే ఇంట్లో విషాదం జరిగినా శుభకార్యం జరిగినా బంధువులు అధికంగా వచ్చినా అన్నీ ఇబ్బందులే. సెంటు స్థలం అయినా సొంతిల్లు ఉండడం ఎవరికైనా గౌరవంగా ఉంటుంది.

– గుంటి నాగలక్ష్మి మంగళగిరి

మరుగుదొడ్ల స్కాంలో ఎమ్మెల్యే డోలా నెంబర్‌వన్

ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: టీడీపీ హయాంలో దోచుకో..దాచుకో అనే చందంగా కొండపి ఎమ్మెల్యే డోలా వీరాంజనేయస్వామి అనేక అక్రమాలకు పాల్పడ్డాడని, అక్రమాలను ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్న నీచ సంస్కృతులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సాగవని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండపి ఎమ్మెల్యే స్వామి టీడీపీ హయాంలో మరుగుదొడ్లు నిర్మించకుండానే రూ.22 కోట్లు స్వాహా చేశాడని ధ్వజమెత్తారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా టీడీపీ నేతలు, ఎమ్మెల్యేలు ముందు వరుసలో ఉన్నారన్నారు. అవినీతిని ప్రశ్నిస్తే కొండపిలో అలజడులు సృష్టించి దాడులకు పాల్పడం సిగ్గు చేటన్నారు. టీడీపీ హయాంలో చేసిన అక్రమాలు, అన్యాయాలన్నీ బయటకు వస్తాయన్నారు. ఎమ్మెల్యే స్వామి అక్రమాలను బయటపెడితే దాడులకు పాల్పడటం టీడీపీ అహంకారానికి నిదర్శనమన్నారు. టీడీపీ నేతల ఆగడాలకు రానున్న ఎన్నికల్లో ప్రజలే మరోసారి బుద్ధి చెబుతారన్నారు. టీడీపీ మోసపూరిత ఎన్నికల మేనిఫెస్టో, హామీలను ప్రజలు నమ్మరని ఎమ్మెల్సీ సునీత అన్నారు.

తండ్రి రుణం తీర్చుకున్న కుమార్తె

తండ్రికి తలకొరివి పెట్టిన వైనం



తండ్రికి తలకొరివి పెట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కుమార్తె అంజలి

చినగంజాం: కొడుకులేని ఓ తండ్రికి కుమార్తె తానే కొడుకై తల కొరివి పెట్టి తండ్రి రుణం తీర్చుకున్న సంఘటన మంగళవారం బాపట్ల జిల్లా చినగంజాం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే చినగంజాం పంచాయతీ సోపిరాల గ్రామానికి చెందిన తుమ్మలపెంట వెంకటరావు(64) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. వెంకటరావుకు ఇద్దరు కుమార్తెలు. వారిని అత్యంత గారాబంగా పెంచాడు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపించాడు. తమను ప్రేమగా చూసుకున్న తండ్రి మరణంతో కుమార్తెలు తల్లడిల్లారు. తండ్రికి తలకొరివి పెట్టేందుకు కుమారుడు లేక బంధువులంతా ఇబ్బందులు పడుతున్న తరుణంలో వెంకట్రావు పెద్ద కుమార్తె అంజలి ముందుకొచ్చింది. తానే కుమారుడిలా అన్నీ కార్యాలు నిర్వహిస్తానంటూ మంగళవారం కుండ చేతబట్టి, అంత్యక్రియల్లో పాల్గొని తల కొరివి పెట్టింది. ఆమెతోపాటు రెండో కుమార్తె ఈశ్వరి సైతం అక్కకు సాయంగా ఉండి అంతిమ యాత్రలో ఆమె వెంట నడిచింది. అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించి తండ్రి రుణం తీర్చుకున్నారా కుమార్తెలు.

మహిళను బెదిరించిన వారిపై కేసు

పట్నంబజారు: క్షుద్రపూజలు చేసి చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసుల కథనం ప్రకారం శ్రీనివాసరావు పేటకు చెందిన తోటా అంజనాదేవి కుటుంబ పరిస్థితులు బాగోలేని నేపథ్యంలో ఓల్డ్‌క్లబ్ రోడ్డులో ఉండే నరసింహారావు అనే వ్యక్తికి దోష పూజలు చేస్తాడని తెలిసి రూ. 25 వేలు అందించారు. డబ్బులు తీసుకుని రక్ష రేఖలు కట్టి ఇచ్చాడు. కొద్దిరోజుల తరువాత పూజలు నిమిత్తం వెళ్లగా, అంజనాదేవికి మాయమాటలు చెప్పి రూ. ఐదు లక్షలు చేబదులుగా తీసుకున్నాడు. డబ్బులు ఇవ్వకపోగా ఇదేమని ప్రశ్నించడంతో చేతబడి చేసి చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. నిందితుడితోపాటు శివ, సాంబశివరావు, బుజ్జిలు బాధితురాలిని ఇబ్బందులకు గురిచేసిన నేపథ్యంలో కేసు నమోదు చేసి దరార్యప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి ఒకరి మృతి

గుంటూరు రూరల్: మితిమీరిన వేగంతో వెళుతూ ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన సోమవారం అర్ధరాత్రి నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం నల్లచెరువుకు చెందిన పల్లం రాజేష్ (29), అదే కాలనీకి చెందిన అల్లం సురేష్ గోపిలు సోమవారం అర్ధరాత్రి సమయంలో ద్విచక్రవాహనంపై ఏటుకూరు నుంచి విజయవాడవైపుగా ఎన్‌హెచ్ 16లో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో బుడంపాడు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో రాజేష్ అక్కడికక్కడే మృతి చెందగా సురేష్ గోపికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. మృతుని భందువులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

12న మెగా అప్రంటీస్ జాబ్‌మేళా

చెరుకుపల్లి: గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 12వ తేదీ జరిగే మెగా అప్రంటీస్ జాబ్‌మేళాను ఐటీఐ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని గూడవల్లి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ హుల్దాలాల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరానికి ముందు ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పూర్తి చేసుకొని పాస్ సర్టిఫికేట్ పొందినవారు హాజరు కావాలన్నారు. మేళాకు జిల్లాలోని అనేక ప్రముఖ కంపెనీలవారు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని, ఈ మెగా అప్రంటీస్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు వారి సర్టిఫికెట్ జిరాక్సులు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, పాస్‌పోర్టు ఫొటోలతో రావాలన్నారు. వీరితోపాటు ఐటీఐ పాస్ లేదా ఫెయిల్ అయిన వారికి ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ చందోలు వారు కూడా అదే రోజు జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 9398650408 నంబరులో సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కారంచేడు: అప్పులు తీర్చలేని ఓ వ్యక్తి పురుగుమందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్వర్ణ గ్రామానికి చెందిన సీహెచ్ వెంకట్రావు (35) గ్రామంలో కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులిచ్చిన వారి ఒత్తిడితో పరువుపోతోందని సోమవారం భార్యతో చెప్పాడు. అవే తీరుతాయిలే అని భార్య నచ్చచెప్పింది. అయినా మనస్తాపంతో స్వర్ణ-చీరాల రోడ్డులోని తాటిచెట్ల సమీపంలో పురుగుమందు తాగాడు. అక్కడ నుంచి నేరుగా ఇంటికి చేరుకున్న వెంకట్రావు పురుగుమందు తాగానని చెప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే చీరాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

అతిసార వ్యాధిపై ప్రజలను అప్రమత్తం చేయాలి

బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ

రేపల్లె రూరల్: సీజనల్‌గా వ్యాప్తి చెందే అతిసారంపై గ్రామీణ ప్రాంతాలలో ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.విజయమ్మ చెప్పారు. ప్రభుత్వ వైద్యశాల సమావేశ మందిరంలో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశలు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. విజయమ్మ మాట్లాడుతూ కలుషితమైన ఆహారం తీసుకోవటంతో అతిసార వ్యాధి బారినపడి నీళ్ల విరేచనాలతో వ్యక్తి నీరసించి పోతాడన్నారు. అతిసారతో అధికంగా అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అతిసార నుంచి కొంత మేర ప్రజలను కాపాడేందుకు పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్‌లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్‌లెట్‌లను ఉచితంగా అందజేస్తున్నట్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. వీటిని తీసుకోవటంతో రోగికి ఉపశమనం రావటంతోపాటు నీరసం తగ్గుతుందన్నారు. వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందేలా చైతన్యపరచాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులకు ఆపరేషన్‌లు లేకుండా సుఖ ప్రసవాలు జరిగేలా తొలిప్రాధాన్యతనివ్వాలని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అందుతున్న సేవలపై గర్భిణులకు వివరించి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందేలా చైతన్యపరచాలన్నారు. అతిసారపై ఈ నెల 5వ తేది నుంచి 15వ తేదీ వరకు చైతన్య వారోత్సవాలు నిర్వహించి ప్రజలకు వివరించాలని ఆదేశించారు. సమావేశంలో వైద్యులు ఎస్.రమేష్, జాన్‌ప్రసాద్, అబ్దుల్ రెహమాన్, ఎంపీహెచ్ఎస్ గళ్లా చక్రధరరావు, ఎం.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

15 మంది ఎంపీడీవోలకు పోస్టింగ్స్

గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి పొందిన 15 మంది అధికారులకు పోస్టింగ్స్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. సంబంధిత 15 మందికి ఎంపీడీవోలుగా ఇటీవల ఉద్యోగోన్నతి కల్పించిన ప్రభుత్వం తాజాగా మండలాలను కేటాయించింది. ఎంకే చక్రపాణి ప్రసాద్ (నగరం), బీఎం శేషమాంబ (పీవీపాలెం), కె. శివపార్వతి (రేపల్లె), బి. శ్రీనివాసరావు (వేమూరు), పి. రామకృష్ణ (పెదకాకాని), జి.శేషగిరిరావు (వట్టిచెరుకూరు), కె. ప్రభాకర్‌రావు (మేడికొండూరు), పి.శివ సుబ్రహ్మణ్యం (అచ్చంపేట), కె.శ్రీనివాసరావు (చిలకలూరిపేట), కె.సమతావాణి (దుర్గి), ఏవీ రంగనాయకులు (ఈపూరు), బి.మహేష్‌బాబు (క్రోసూరు), ఎన్. వెంకటేశ్వరరావు (నరసరావుపేట), టి. వీరభద్రరావు (నూజెండ్ల), యూబీ వరప్రసాద్ (మాచవరం)కు పోస్టింగ్స్ పొందారు. అదే విధంగా తొమ్మిది మంది ఎంపీడీవోలకు బదిలీల్లో స్థాన చలనం కలిగింది. ఈ విధంగా ఎ. శ్రీనివాసరావు తుళ్లూరు నుంచి పొన్నూరు, ఎ. దీప్తి వట్టిచెరుకూరు నుంచి తాడికొండ, ఎం.శోభారాణి మేడికొండూరు నుంచి దాచేపల్లి, వై.మహాలక్ష్మి దాచేపల్లి నుంచి రెంటచింతల, వై. రాజగోపాల్ మాచవరం నుంచి పెదనందిపాడు, పి.సీతారామయ్య బొల్లాపల్లి నుంచి శావల్యాపురం, షేక్ గౌసియా బేగం రెంటచింతల నుంచి బొల్లాపల్లి, ఎం. శ్రీదేవి అచ్చంపేట నుంచి కాకుమాను, పీఎస్ పద్మాకర్ చిలకలూరిపేట నుంచి నాదెండ్లకు బదిలీ అయ్యారు.

జాతీయ రహదారి పనులు వేగవంతం చేయండి

సమీక్షించిన ఎంపీ లావు, జిల్లా కలెక్టర్ శివ శంకర్



వీడియా కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తున్న ఎంపీ లావు, జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జాతీయ రహదారి 167ఏ నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నకిరేకల్లు–నరసరావుపేట–చిలకలూరిపేట మీదుగా ఓడరేవు వరకూ నిర్మించనున్న జాతీయరహదారి 167ఏ పనుల నిర్వహణ, భూసేకరణ అంశంపై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కేఆర్.కల్పశ్రీ, డీఎఫ్ఓ రామచంద్రరావు, డీఆర్వో కె.వినాయకం, ఆర్డీవోలు ఎం.శేషిరెడ్డి, రాజకుమారి, జాతీయరహదారుల అథారిటీ ప్రతినిధులు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఐపీ పెట్టిన వ్యాపారి

- చీటీపాటల పేరుతో మోసం
- రెండేళ్ల కిందట రూ.20 కోట్లతో పరారీ
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు
- రెండేళ్ల తర్వాత పోలీసులకు చిక్కిన నిందితుడు

నరసరావుపేటటౌన్: చీటీపాట పేరుతో మోసం చేసి రూ.20 కోట్లతో పరారైన నిందితుడు ఎట్టకేలకు చిక్కాడు. రెండేళ్లుగా పేట పోలీసుల కళ్లుగప్పి తెలంగాణ రాష్ట్రంలో తలదాచుకుంటున్న అతనిని రెండు రోజుల కిందట వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దీంతో అప్పు ఇచ్చిన బాధితులంతా మంగళవారం పెద్దఎత్తున స్టేషన్ వద్దకు చేరుకున్నారు. వివరాల్లోకి వెళితే... పట్టణానికి చెందిన తాడికొండ తులసి వెంకట చంద్రశేఖర్ ఉరఫ్ లాటరీ శేఖర్ కొన్నేళ్లుగా వ్యాపారం చేస్తూ జనాల నుంచి నమ్మకం పొందాడు. దీంతో అతని వద్ద చీటీపాటలు వేశారు. దీంతోపాటు అధిక వడ్డీ ఆశచూపి వ్యాపారుల వద్ద నుంచి పెద్దమొత్తంలో డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. సుమారు రూ.20 కోట్ల వరకు పోగుచేసుకుని రెండేళ్ల కిందట కుటుంబంతో సహా ఉడాయించాడు. పరారైన రెండు నెలల తర్వాత కోర్టులో ఐపీ దాఖలు చేశాడు. చీటీపాట వేసి మోసపోయిన బాధితుల్లో కొంత మంది వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో 2021 మార్చి నెలలో శేఖర్‌పై చీటింగ్ కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా నిందితుడి కోసం పోలీసులు రెండేళ్ల పై నుంచి గాలిస్తున్నారు. నిందితుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకొని అక్కడికి వెళ్లి వలపన్ని పట్టుకున్నట్లు సమాచారం.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



రైతులకు సూచనలిస్తున్న డీడీఏ శివకుమారి

బొల్లాపల్లి: పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి అన్నారు. మండలంలోని కనుమలచెరువు, గుట్టపల్లి, వెల్లటూరు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పత్తి పొలాలను పరిశీలించారు. ఇటీవల కాలంలో వర్షాలు కురవటంతోపాటు అధిక ఉష్ణోగ్రతల వల్ల పత్తి పంటలో ఆకులు పండుబారిపోయి రాలిపోతున్నట్లు గుర్తించారు. ఆకు రాలటాన్ని అరికట్టాలంటే మెగ్నీషియమ్ సల్ఫేట్ 10 గ్రాములు, పోటాషియం నైట్రేట్ 10 గ్రాముల లీటరు నీటిలో కలపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే చల్లటి వాతావరణంలో పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను తెలియజేశారు. కార్యక్రమంలో మండలం వ్యవసాయాధికారి అంకారావు, వీఏఏ పి.నాసర్‌ల తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.